# "అజ్ఞాత ప్రేమ"

శ్రీ హరగోపాల్

శారదకు లేక లేక పాపాయి పుట్టాడు. పాల బుగ్గలతో పండులా పుట్టిన పాపాయిని చూసి మురిసిపోయింది శారద.

గట్టిగా కరువుతీర ముద్దు పెట్టుకోబోయింది పాపాయిని.

"అగు! అగు! పసిపాపకు ఊపిరాడదు" అని హెచ్చరించాడు సుధాకర్.

భర్త హెచ్చరికకు సిగ్గుపడి వెనక్కు తగ్గింది శారద.

"నేను ముద్దుపెట్టుకుంటే మీ అబ్బాయి కంది పోడు లెండి" అంది ముసుగును సవరించుకుంటూ.

బలహీనంగా ఉన్న ఆమె ముఖాన్ని, తేల చూపుల్ని పరిశీలించి, చిన్నగా నవ్వాడు బలహీనంగా సుధాకర్.

"పథ్యం సరిగా చేస్తున్నావా?" ప్రశ్నించాడు వాత్సల్యంతో.

"నా పథ్యానికేంగాని, ఈమధ్య మీరు భోజనం, ఫలహారం సరిగా చేస్తున్నారా? వేళకు నేను జ్ఞాపకం చేస్తేనేగాని మీకు తెలిసేదిగాదు. ఆఫీసుపనిలో మునిగిపోయేవారు" అంది ఆందోళనను కనబరుస్తూ.

"ఇన్నాళ్ళు నన్ను చంటిపాపలా సాకావు. కానీ, ఇప్పుడు నువ్వు సాకవలసింది ఈ చంటిపాపను తెలుసా?" ఛలోక్తి విసిరాడు.

"నాకు మీరిద్దరూ రెండు కళ్ళు" అంది పాపాయిని ప్రేమతో నిమురుతూ భర్తకేసి ప్రేమగా చూస్తూ.

"అల్లాగా! మన పాపాయికి ఏం పేరు పెడదాం?" అని అడిగాడు.

"మీకిష్టమైన పేరు. మీకు ఈ విషయం పట్టక పోతే, అత్తగారికి మామగారికి నచ్చినపేరు" అంది నవ్వుతూ.

"సరిపోయింది." సాగదీశాడు "ఈ భారం వాళ్ళమీద పెడితే, ఏ పుల్లయ్యో, ఏ శరభయ్యో అని పెడతారు. నాకు నాజూకు పేర్లు తెలియవు. కనుక నీవే ఏదో పేరు పెట్టెయ్యి. మేమందరం పిలుచుకుంటాము" అన్నాడు నవ్వులో నవ్వు కలుపుతూ.

అయిదు నిముషాలు దీర్ఘంగా ఆలోచించింది శారద.

"అయితే! దివాకర్ అని పేరు పెడదాం" అంది ఆశగా.

"దివాకర్!" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు సుధాకర్.

శారద కంపించింది. "అవును. మీరు సుధాకర్, అబ్బాయి దివాకర్. ఒకళ్ళు నాకు వెన్నెల ప్రసాదించితే ఒకళ్ళు నాకు వెలుగు ప్రసాదిస్తున్నారు" అంది తన మనసులోని అభిప్రాయాన్ని కప్పిపుచ్చి.

"అల్లాగా! అయితే వెన్నెలతోడును, వెలుగు తోడును నీ దగ్గరే కట్టేసుకున్నావన్నమాట!" అన్నాడు నవ్వుతూ, ఆమె బుగ్గను చిలుకుతూ.

ఆ మాటకు మనసు కుదుటపర్చుకుని "చాలు కొండి!" అంది సిగ్గుపడుతూ శారద.

"అయితే! పోతున్నాను. ఆఫీసుకు టైము అయింది. మళ్ళీ 5 గంటలకు అమ్మగార్ని, అయ్యగార్ని దర్శించుకుంటాను" అని బూట్లు చప్పుడు చేసుకుంటూ వెళ్ళిపోయాడు సుధాకర్.

నవ్వుతూ, భర్త కనిపించేటంతవరకు చూస్తూ వుండిపోయింది శారద. సుధాకర్ చాటుకుపోగానే, ఆమె కళ్ళఎదుట దివాకర్ కనిపించసాగాడు. తెరలు తెరలుగా ఆమె మెదడులో పాతవిషయాలన్నీ సుడులు తిరగసాగాయి.

తను అప్పుడు హైదరాబాదులో B.Sc. చదువు

తోంది. అప్పుడు దివాకర్ M.B.B.S. రెండవ సంవత్సరం చదువుతున్నాడు.

హైదరాబాదు వచ్చిన కొత్త రోజులలో ఇద్దరూ ఒకేసారి సాలర్‌జంగ్ మ్యూజియం చూడడానికి వచ్చారు. అప్పుడు వాళ్ళిద్దరికీ ప్రథమ పరిచయమైంది.

చామనచాయ, అంతపొడుగుగాక పొట్టిగాకుండా, చిరునవ్వుతో నవ్వుతో తొణికిసలాడే దివాకర్ ముఖము, అతని చురుకుతనం శారద హృదయాన్ని బాగా ఆకర్షించాయి.

శారదయొక్క అణుకువ, ఆమె ముగ్ధమోహన రూపం దివాకర్‌ను ఆకర్షించాయి. ఆ మ్యూజియంలో ఉన్న కాసేపు వాళ్ళిద్దరూ, అక్కడవున్న వస్తువులు చూడడంమాని, ఒకరి ముఖాల నొకరు, ఒకరికి తెలియకుండా ఒకళ్లు, అక్కడవున్న అద్దాలలో చూడసాగారు.

ఒకరితో ఒకరికి మాట్లాడాలని అభిలాష కాని, మాట్లాడే సాహసం ఏ ఒక్కరికీ గూడ లేకపోయింది.

ఒకరినొకరు వదులుకోలేక, ఒకళ్ళ ముఖాన్ని ఒకళ్ళు సిగ్గుపడుతూ చూచుకుంటూ బరువైన హృదయంతో, ఇద్దరు చెరో రిక్షామీద ఎవరి తావులకు వాళ్ళు వెళ్ళిపోయారు.

వాళ్ళ దేహాలు వెళ్ళిన వారి హృదయాలు మాత్రం ఒకదాన్నొకటి వదులుకుని పోలేకపోయాయి.

ప్రతిరోజూ అయిదు గంటలప్పుడు పబ్లిక్ గార్డెన్‌కు వస్తే ఆమె కనిపిస్తుందేమో అని అతడు, అతడు కనిపిస్తాడేమో అని ఆమె రెప్పవాల్చకుండా చూచుకునేవారు. ఫైర్‌కు వెళ్ళినా, సినిమాకు వెళ్ళినా వాళ్ళిద్దరికీ ఈ ధ్యాసతప్ప మరొకటి వుండేదిగాదు.

ఆరోజున అకస్మాత్తుగా చార్‌మినార్ వద్ద, ఇందిర కనిపించింది శారదకు.

"ఓ శారదా! ఉన్నట్లుండి ఒక్కసారి మెరుపులా కనిపించావేమిటే?" అని ప్రశ్నించింది ఇందిర.

"అవునే, మనం నరసాపురం టైలర్ హైస్కూలులో S.S.L.C. చదువుతూ వుండగా విడిపోయాము. మళ్ళీ ఇప్పుడే కలిశాము. ఏమిటే! ఇలా వచ్చావు. హైదరాబాద్‌లో చుట్టాలున్నారా?" ప్రశ్నించింది శారద.

"లేదే! మా అన్నయ్య ఇక్కడ మెడిసన్ చదువుతున్నాడు. అకస్మాత్తుగా అన్నయ్యకు ఆరోగ్యం చెడిందని ఉత్తరం వస్తే, మా అమ్మా నేను వచ్చాము" అంది ఇందిర.

"ఇప్పుడు కులాసాగా వుందా?" అని అడిగింది శారద.

"లేదే రోజురోజుకు టెంపరేచర్ పెరిగిపోతోంది గాని ఎక్కడా తగ్గుముఖం కనిపించడంలేదు. చాలా బెంగగా వుందే" అంది బేలగా.

"ఫ్లూ జ్వరమేమో!" అంది శారద.

"ఏమో! డాక్టర్లకే అంతుపట్టలేదు. ఒకసారి మా యింటికి రావే. చాలా రోజులకు కనిపించావ్" అని బ్రతిమాలింది ఇందిర.

శారద, ఇందిర మాట కాదనలేకపోయింది. ఇద్దరూ కలిసి హిమాయత్‌నగర్‌లో ఉన్న ఇందిర ఇంటికి వచ్చారు.

"అమ్మా! శారదను తీసుకొచ్చానే" అంది ఇందిర.

"శారద ఎవరే?" ప్రశ్నించింది మహాలక్ష్మమ్మ.

"నరసాపురంలో నాతో Vth ఫారం వరకు కలిసి చదివిందే, మనవాళ్ళే-ఇప్పుడు ఇక్కడ B.Sc. చదువుతోందిట" అంది.

శారద, మహాలక్ష్మమ్మకు నమస్కారం చేసింది. "శీఘ్రమేవ వివాహమస్తు" అని దీవించింది మహాలక్ష్మమ్మ ముఖం చాటంత చేసుకుని.

"రావే శారద మా యిల్లు చూద్దువుగాని" అని ఇల్లంత చూపించింది ఇందిర.

"మీ యిల్లు చాలా బాగుందే! అన్ని హంగులు వున్నాయి. హైదరాబాద్‌లో మాకు ఇటువంటిది దొరకడం చాలా గగనం" అంది శారద.

"చాల్లేవే! నచ్చక నచ్చక నీకు యీ యిల్లే నచ్చింది" అంది ఇందిర.

"అదిసరే! గాని, మీ అన్నయ్యకు జ్వరమని అబద్ధమాడావేమే. ఎక్కడా కనిపించలేదేం?" ప్రశ్నించింది దెప్పుతూ శారద.

"అదక అదక ఇలాంటి అబద్ధాలే ఆడాలా! నీవు సిగ్గుపడతావని తీసుకెళ్ళలేదు. ఆ గదిలోనే

వున్నాడు చూడు'' అని ఆమెను ఆ గది కిటికీ దగ్గరకు తీసుకువెళ్ళి చూపించింది ఇందిర.

శారద, కిటికీలోంచి చూసి ఆశ్చర్యపోయింది. ఏ వ్యక్తికోసమైతే తను, తన కళ్ళు గాలిస్తున్నాయో, ఆ వ్యక్తే ఆమె కళ్ళబడ్డాడు.

''ఎక్కడో చూచిన గుర్తుంది. పేరేమిటి?'' అని ప్రశ్నించింది తను బయటపడకుండ శారద.

''దివాకర్-మా అమ్మ ముచ్చటపడి పెట్టుకుంది'' అంది ఇందిర.

''దివాకర్'' తృప్తికలిగేలా ఉచ్చరించింది శారద.

కల్యాణశీలమైయున్న అతన్ని చూసి ఎంతగానో ఆందోళనపడింది శారద.

''రావే! డాబామీదకు పోయి పిచ్చాపాటి మాట్లాడుకుందాం'' అంది ఇందిర.

''మళ్ళీ వస్తానే! ఆలస్యమైతే అమ్మ కంగారు పడుతుంది'' అని చెప్పి శారద సుల్తానాబజారులో ఉన్న తన యిల్లు చేరింది.

అహర్నిశలు అతన్ని గురించే తను ఆరాటపడ సాగింది. ఇందిర అన్నయ్య అని ఆమెకు ఇంతవరకు తెలియదు. తెలిస్తే, ఈపాటికి అతనితో తనకు పరిచయం కలుగకపోయేదా? అని అనుకుని సిగ్గుతో మురిసిపోయింది. కనుచూపుమేరలోనే తన కలలు నిజమయ్యే ఘడియ వుందని తన మనసు ఎంతగానో వువ్విళ్ళూరింది.

ఆరోజు సాయంత్రం హుస్సేన్‌సాగర్ వద్ద ఇందిర కనిపించింది. దీనంగా ఆ సిమ్మెంటు బెంచీ మీద కూర్చుని, ఆ నీటి కెరటాలను చూస్తూఉంది. శారదకు ఆశ్చర్యమేసింది. ఆందోళన కలిగింది. ''ఇందిరా'' అని ఆప్యాయంగా పిలుస్తూ ఆమెను సమీపించబోయింది.

''నన్ను ముట్టుకోకు శారద మయల వచ్చింది' అంది కన్నీళ్లు కక్కుతూ ఇందిర.

''ఆ! నిశ్చేష్టురాలైంది శారద.

మా అన్నయ్య నిన్ననే కన్నుమూశాడు'' అంది భోరున ఏడుస్తూ.

శారదకు కన్నీటిపర్యంతమైంది. ఆమె హృదయం బావురుమని భోరున ఏడ్చింది.

దివాకర్ తన కళ్ళఎదుట మెరుపులా మెరిసి మాయమయ్యాడు. దివాకర్‌తోటి అనుభవాలన్నీ తన జీవితంలో ఒక తీయని కలలాంటిది.

బరువైన హృదయంతో ఇల్లు చేరింది శారద. ఎన్నోరోజులు అతని మూర్తిని మనసులో ఊహించుటకు పరిపరివిధాల పరితపించింది.

ఇటువంటి సమయంలో తనబావ సుధాకర్‌ను వివాహం చేసుకోమని పెద్దవాళ్ళంతా ఆమెను వత్తిడిచేశారు.

సుధాకర్ చాలా తొందరమనిషి. త్రాగేవాడు. పేకాటాడేవాడు. తల్లిదండ్రులను కొట్టేవాడు. కానీ, శారద అంటే పడిచచ్చేవాడు.

ఒకరోజున సుధాకర్ తండ్రి స్వయంగా శారద దగ్గరకు వచ్చి ఆమెను తనకు కోడలు కమ్మని ప్రాధేయపడ్డాడు.

''అమ్మా! శారద! బావ చెడ్డవాడే, మంచి వాడని నేననను. నాకున్న వంకాయకురసుల్లా అతను వక్కడే. నీమీద వాడికి మనసుంది. నీవు తలుచుకుంటే, వాడ్ని మళ్ళీ మనిషిని చెయ్యగలవు. నా బిడ్డను, నా పరువు నిలపగలవు. కావాలంటే, నా యావదాస్తిని నీపేర పెడతాను. నా యింటికి లక్ష్మిలా వచ్చి, నా యిల్లు నిలబెట్టు. నా బిడ్డను మనిషినిచేసి నన్ను చరితార్థుడ్ని చెయ్యి'' అని బ్రతిమాలాడు మామయ్య.

''మామయ్యా! పెద్దవాడివి. ఏమిటిది. సరే అలాగే కానియ్'' అంది గుండె రాయి చేసుకుని, భవిష్యత్తును భగవంతునికి వదిలి.

ఆనాటినుండి తన మనసులోని దివాకర్‌ను తన కంటిముందువున్న సుధాకర్‌లో వూహించుకుని, ఇన్నాళ్ళకు తన కడుపున ఆ దివాకర్‌నే కన్నాననుకుని మురిసిపోయింది శారద.

అందువల్లే తన బిడ్డకు ఆమె దివాకర్ అని పేరు పెట్టింది. ఆమెకు సుధాకర్, దివాకర్ యిద్దరూ రెండు కళ్ళు. అప్పుడు అంతే. ఇప్పుడు అంతే. ఎప్పుడూ అంతే.

—(౦)—